క్లుప్తంగా

పోషకాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మద్దికెర: బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం పోషకాహార మసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు చిరుధ్యాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు, గుడ్లు, పాలు అధికంగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ ఉపాధ్యాయురాలు పద్మావతిని సన్మానిస్తున్న విద్యార్థులు

చిప్పగిరి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీలో బాలగీత్, కహానీ, నిబంధ్ రచనతో పాటు వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ లతీఫ్, ఉపాధ్యాయులు పద్మావతి, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

మద్దికెర: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం అల్యూం ఆఫ్ ఇండియా కంపెనీ దివ్యాంగులకు అందజేసిన రూ. 23 లక్షల విలువ చేసే 96 ట్రైసైకిళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. రోడ్లు, నీటి సమస్య తదితర వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కరిస్తామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు సుహాసిని, విజయుడు, ఆంజనేయులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజన్న, పురుషోత్తం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి



పెరియార్ రామస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దేవనకొండ: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం పెరియార్ రామస్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయుడు రోషన్న ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రోషన్న మాట్లాడుతూ ఆత్మాభిమానం గల హేతువాదిగా పెరియార్ రామస్వామి భారతీయ సమాజంలో కుల వ్యవస్థను తీవ్రంగా ఖండించారన్నారు. ఆయన ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, సాంఘిక ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, నబిరసూల్, విక్టర్, సోమశేఖర భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఈశ్వరరెడ్డి కోడలు మృతి



విశాలాక్షి(ఫైల్)

తుగ్గలి : మాజీ ఎమ్మెల్యే దివంగత ఈశ్వరరెడ్డి కోడలు, రైతు సంఘం జిల్లా నాయకులు జీ.ఎర్రగుడి భాస్కరరెడ్డి సతీమణి విశాలాక్షి(62) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఇంట్లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా గుండపోటుకు గురై మృతి చెందారు. ఆమెకు భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. బుధవారం స్వగ్రామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు. విశాలాక్షి మరణం పట్ల సీపీఎం, పలు పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సేవాసమితి సభ్యులు..

ఆలూరు: విజయవాడ వరద బాధితులకు ఆలూరు షిరిడీ సాయి బాబా, బెల్లం గుండు ఆంజినేయస్వామి మందిరాల సేవా సమితి సభ్యులు మంగళవారం రూ 50,116 ఆర్థిక సాయం ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాగేంద్ర శెట్టి, బాషా, స్వామి తదితరులు పాల్గొన్నారు.

‘ఆల్బెండజోల్’తో రక్తహీనత దూరం



ఆలూరులో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఎంపీడీఓ అల్లబకాష్

ఆలూరు రూరల్: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారించవచ్చని ఎంపీడీఓ అల్లబకాష్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని మొలగవల్లి పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. నులి పురుగల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వారికి ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రలు వేయాలన్నారు. పిల్లలు తీసుకున్న పోషకాలను నులి పురుగులు సంగ్రహిస్తాయని, దీని వలన పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపంతో వారు బలహీనపడతారని చెప్పారు. రెండు నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజీ, రెండేళ్ల వయసు పిల్లలకు 200 ఎంజీ మాత్రలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాషా, సచివాలయాల ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు హాజరయ్యారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

చిప్పగిరి: నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా మంగళవారం స్థానిక జూనియర్ కాలేజీ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. స్థానిక జూనియర్ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వరదరాజులు, ఏఎన్‌ఎం శాంతకుమారి, పలువురు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కృష్ణగిరి: ఆల్బెండజోల్ మాత్రలతో చిన్న పిల్లల్లో రక్తహీనతను నివారించవచ్చని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు ఏడాదికి రెండుసార్లు నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేయాలన్నారు. అలాగే బుధ, శనివారాల్లో గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. మండలంలో 12,547 మంది చిన్నారులకు గాను 12,117 చిన్నారులకు మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వమోహన్, ఈఓఆర్డీ మురళీమోహన్, ఎంఈఓ సునంధ, ఎంపీహెచ్ఈఓ గజేంద్రారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

మద్దికెర: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా అన్నారు. మంగళవారం మద్దికెర జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. విద్యార్థులు భోజనానికి ముందు తర్వాత సోపుతో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. లేకుంటే కడుపులో నులిపురుగులు చేరి అనారోగ్యం పాలవుతారన్నారు. ప్రతి రోజు స్నానం చేయాలని తెలిపారు. ఒంటిపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే వైద్యశాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జ్యోతి, ప్రధానోపాధ్యాయులు అజరయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

వెల్దుర్తి: నులిపురుగుల నివారణకు పిల్లలు, విద్యార్థులకు మంగళవారం మండల వ్యాప్తంగా 62 ప్రభుత్వ, 6 ప్రైవేట్ పాఠశాలలు, రెండు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీలు, 58 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. గోవర్ధనగిరి, రామళ్లకోట పీహెచ్‌సీల పరిధిలోని 12,260 మందికి మాత్రలు అందించాల్సి ఉండగా 11,530 మందికి మాత్రలు వేసినట్లు ఆయా పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు నాగన్న, నాగలక్ష్మి, మోహన్, ఆనెమ్మ తెలిపారు. మాత్రలు వేయని వారికి ఈ నెల 25వ తేదీ అందించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి

దేవనకొండ: వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌కు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించేలా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని వీఆర్‌పీఎస్ నాయకులు రాంభీంనాయుడు, సురేంద్రనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం వారు సిరిగాపురంలో వాల్మీకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2017 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి సిఫారసు చేసిందన్నారు. అయితే దానికి చట్టబద్ధత కల్పించలేదన్నారు. అనంతరం వీఆర్‌పీఎస్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో వీఆర్‌పీఎస్ నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, శ్రీనివాసులు, రాముడు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

మద్దికెర: మహాలయ పున్నమిని పురస్కరించుకుని మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వేంకటేశ్వరస్వామికి మంగళవారం గరుడ సేవ నిర్వహించారు. అలంకార భూషితుడైన స్వామివారు గరుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

చిప్పగిరి: కేంద్ర ప్రభుత్వ ఏడీఐపీ పథకంలో భాగంగా మండలంలో అర్హులైన వికలాంగులకు మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే విరూపాక్షి చేతుల మీదుగా ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 16 ఎలక్ట్రికల్, 15 సాధారణ ట్రై సైకిళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జూటూరు హేమలత, కన్వీనర్ మారయ్య, మాజీ జెడ్పీటీసీ మీనాక్షి నాయుడు, భీమలింగ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లండి

హొళగుంద: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని, తామనుకున్న లక్ష్యాన్ని చేరువ కావాలని డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నీతి అయోగ్ ద్వారా ఏడీఐపీ స్కీంలో భాగంగా దివ్యాంగులకు ఉచితంగా పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ సుహాసినమ్మ, ఏబీఎఫ్ రవిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మానసిక, చవిటి, మూగ, కాళ్ల చేతులు లేని లబ్ధిదారులకు 13 వీల్ చేర్స్, 16 మోటరైజ్‌డ్ ట్రైసైకిల్స్, 47 ట్రైసైకిల్స్‌తో పాటు స్టిక్స్ తదితర వాటితో కలిపి 267 పరికరాలను (33 రకాలు)167 మందికి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చలవాది రంగమ్మ, వైస్ ఎంపీపీ గాదెమ్మ, ఆయా పార్టీల నాయకులు పంపాపతి, శేషప్ప, వెంకటేష్, ఈశా, దుర్గాప్రసాద్, కెంచప్ప తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ఆస్పరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ-2 తిరుమలరావు సూచించారు. మంగళవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో మధ్యాహ్న భోజనం మెనూ, తయారీ విధానంపై వంట ఏజెన్సీ మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ వంట ఏజెన్సీ మహిళలు వంట గదులను, పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాజా కూరగాయలను తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా ప్రిన్సిపాల్ శారూన్ స్పైలీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పని సరి

ఆలూరు: విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులను ఎంఈఓ 2 చిరంజీవి ఆదేశించారు. మంగళవారం స్థానిక గిరిజన ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం, సదుపాయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మికి ఏఐవైఎఫ్ నాయకులు రమేష్, దస్తగిరి, బడేసాహెబ్, గిరి, నవీన్, వీరాంజినేయులు, వీరేష్ వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మంచి నీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

రేపు మండల స్థాయి క్రీడా పోటీలు

తుగ్గలి: పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 19న మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పీడీ పాండురంగరాజు తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, క్రికెట్, త్రోబాల్, సాఫ్ట్‌బాల్ క్రీడలకు ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి ఎంపికైన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు క్రీడా పోటీలకు హాజరుకావాలని సూచించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా సెక్రటరీ చందునాయక్, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలి

ఆస్పరి: రబీ సీజన్‌లో పప్పు శనగ విత్తనాలను రైతులకు సకాలంలో సబ్సిడీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఓ కార్యాలయంలో ఏంపీఈఓ వెంకటేష్‌కు రైతు సంఘం నాయకులు హనుమంతు, మధురెడ్డి, రామాంజినేయులు, వీరన్న, నరేంద్ర, చౌదరి, శ్రీనివాసులు, నరేష్ వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ముందస్తుగా వర్షాలు కురువడం వల్ల నల్లరేగడి భూములు విత్తుకోవడానికి అనువుగా ఉన్నాయన్నారు. ఈ నెలాఖరులోపు 70 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వడమే కాకుండా నాలుగు హెక్టార్ల వరకు రైతులకు విత్తనాలు అందజేయాలన్నారు.

విధులకు గైర్హాజరైన డాక్టర్లు

ఆస్పరి: జీఓ నంబర్. 85ను రద్దు చేయాలని డాక్టర్లు చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో మంగళవారం ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న డాక్టర్లు రఘురామిరెడ్డి, దుర్గాబాయి, మాధవీలత, బాలకృష్ణారెడ్డి విధులకు గైర్హాజరైయ్యారు. ఆస్పత్రిలో డాక్టర్లు లేకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులు చికిత్స లేకుండా వెనుదిరిగారు.

హొళగుంద: ప్రభుత్వం జారీ చేసిన జీఓ.85 కు నిరసిస్తూ హొళగుంద, గజ్జహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు సేవలను నిలిపి వేశారు. దీంతో పీహెచ్‌సీలో ఉన్న సిబ్బంది వచ్చిన రోగులకు ప్రాథమిక చికిత్సలు అందిస్తున్నారు.

వజ్రాన్వేషకులతో రైతులకు నష్టం

తుగ్గలి: వజ్రాన్వేషకులు పంట పొలాల్లో సంచరిస్తుండడం వల్ల పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జొన్నగిరి సర్పంచ్ ఓబులేసు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వజ్రాలు వెతికేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తున్న జనంతో గ్రామంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. రైతులు పొలాలకు వెళ్లాంటే భయపడుతున్నారన్నారు. పంట పొలాల్లో నిత్యం తొక్కుతుండడంతో వేలకు వేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు నాశనమై రైతులకు నష్టం జరుగుతోందన్నారు. పోలీసులు హెచ్చరిస్తున్నా వజ్రాన్వేషకులు లెక్క పెట్టడం లేదన్నారు. వజ్రం కొనుగోలు చేసే వ్యాపారులతో పంచాయతీకి పన్ను చెల్లించే విధంగా చూడాలని అధికారులను కోరారు.

ఘనంగా ప్రధానమంత్రి జన్మదిన వేడుకలు

హొళగుంద /దేవనకొండ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. హొళగుందలో బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహ ప్రసాద్ అధ్యక్షతన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ఏకు మాహంకాళమ్మ ఆలయ ఆవరణలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బళ్లారికి చెందిన శరణపాటిల్, అద్వాల శేషిరెడ్డి, బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు చిదానంద తదితరులు పాల్గొన్నారు. దేవనకొండలో పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నర్వహించారు. దేవనకొండ టర్నింగ్ వద ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. డి.వెంకట రాముడు, యం.ఉచ్చీరప్ప, వీరేష్, రాజు, యల్లయ్య, పాల్గొన్నారు.

కనుల పండువగా చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం



పత్తికొండలో జ్యోతుల ప్రదర్శన తిలకిస్తున్న జనం

పత్తికొండ(తుగ్గలి): మహాలయ పౌర్ణమి సందర్భంగా పట్టణంలో చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం కనుల పండువగా సాగింది. మంగళవారం వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జ్యోతులను నెత్తిన పెట్టుకుని భక్తి గీతాలతో ప్రధాన రోడ్డు మీదుగా చేసిన ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. స్థానికులతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి జ్యోతుల ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంఘం సభ్యులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే జీవన విధానం కావాలి



ఆలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



హాలహర్విలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకునేలా సమష్టిగా ముందడుగు వేయాలని పత్తికొండ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు అన్నారు. మంగళవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య, సచివాలయ సిబ్బందితో కలిసి స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ సిబ్బంది రాంబాబు, వినోద్, వరుణ్ పాల్గొన్నారు.

ఆస్పరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని సర్పంచ్ మూలింటి రాధమ్మ ప్రారంభించారు. ఈ సదంర్భంగా విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ రామ్మూర్తి, ఏపీఓ కళ్యాణ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్ పాల్గొన్నారు.

హాలహర్వి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉసేని, పంచాయతీ కార్యదర్శి ఈరన్న అన్నారు. మంగళవారం హాలహర్విలో స్వచ్ఛతాహీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు రోడ్డుపై మానవహారంగా నిలబడి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు.

పత్తికొండ(తుగ్గలి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత హీ సేవలో భాగస్వాములు కావాలని డిపో సీనియర్ అసిస్టెంట్ మల్లప్ప అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు చెత్తచెదారం, పిచ్చిమొక్కలు తొలగించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.

తుగ్గలి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ జావిత్రి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుగ్గలి కేజీబీవీలో మొక్కలు నాటారు. ఏపీఓ రామకృష్ణ, ఈసీ ప్రదీప్‌కుమార్, పాఠశాల ప్రత్యేక అధికారిణి షాహీన్ పాల్గొన్నారు.

భక్తితో పులకించిన పుట్లూరు





మారెమ్మకు బోనాలు సమర్పించేందుకు వస్తున్న భక్తులు, పూజలందుకుంటున్న అమ్మవారు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో వెలసిన మారెమ్మ బ్రహ్మోత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంధువులు, ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసింది. ఎస్‌ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి భజన పోటీల్లో విరుపాపురం శ్రీమారుతి, గుత్తి ఆర్‌ఎస్ లక్ష్మీనరసింహా, ఉయ్యాలవాడ మూలపెద్దమ్మ, నక్కలాంపల్లె సాయి వీరాంజనేయ, అల్లీనగరం రామాంజనేయ భజనబృందాలు గెలుపొందాయి. వీరికి దాతల సహకారంతో కమిటీ సభ్యులు వరుసగా రూ. 20వేలు, రూ. 15వేలు, రూ.12వేలు, రూ10వేలు, రూ.8వేలను అందజేశారు.

నేడు పాలపళ్ల ఎద్దులకు బండలాగుడు పోటీలు

బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం ఆరు పాలపళ్ల ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ. 25వేలు, రూ. 20వేలు, రూ.15వేలు, రూ12వేలు, రూ.10వేలను అందజేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు రూ. 600 ఎంట్రీ ఫీజు కట్టి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8639363721, 7569390793 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



శ్రీరంగాపురంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వెల్దుర్తి: పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం, ఎరువుల యాజమాన్యం, ధరలు తదితరాలపై మెలకువలు నేర్పి, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఏఓ అక్బర్‌బాషాతో కలిసి శ్రీరంగాపురం గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కొర్ర పంట సాగు చేసిన పద్ధతులపై అవగాహన కల్పించారు. పంట దిగుబడిని సైతం భూమేశ్వర రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వారి సౌజన్యంతో మంచి ధరను ఇప్పించేలా ఒప్పందం చేశారు. కార్యక్రమంలో ఏఈఓ విలసిత, కంపెనీ సీఈఓ శివశంకర్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది మధు, లింగన్న, స్వరూప పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్న రైతు బిడ్డ



కారుమంచి మధుమిత

మద్దికెర: మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన కారుమంచి మల్లికార్జున, ఉమాదేవి దంపతుల కుమార్తె కారుమంచి మధుమిత తిరుపతి పద్మావతి మహిళా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. మధుమిత 10వ తరగతి వరకు పెరవలి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివింది. ఇంటర్ శ్రీచైతన్య కాలేజీలో చదివి కోచింగ్ తీసుకోకుండా 720 మార్కులకు గాను 587 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకు 2844 సాధించింది. 10వ తరగతిలో 576 మార్కులు, ఇంటర్‌లో 946 మార్కులు సాధించింది. కారుమంచి మల్లికార్జున ప్రస్తుతం సర్పంచ్‌గా ఉన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



హొళగుందలో విశ్వకర్మ చిత్రపటం ఊరేగింపు



పత్తికొండ: విశ్వకర్మ జయంతిలో ఆర్డీఓ రామలక్ష్మి

హొళగుంద: మండల కేంద్రంలో మంగళవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటాన్ని మారెమ్మ దేవాలయం నుంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక దేవమ్మ ఆలయంలో విశ్వకర్మ చిత్రపటానికి విశ్వకర్మ బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కులపెద్దలు మురళీధర్, అశోక్, శ్రీనివాసులు, శీనప్ప, మెడికల్ మంజు తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి): పట్టణంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు హరికృష్ణ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. నాలుగు స్తంభాల కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ రామలక్ష్మి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. సమస్త సృష్టిని దేవశిల్పి విశ్వకర్మ భగవానుడు సృష్టించారన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలని విశ్వబ్రాహ్మణులు కోరారు. సంఘం నాయకులు శంకరయ్యాచారి, బ్రహ్మయ్యాచారి, ఆనందాచారి పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళా రైతు మృతి



సువర్ణ(ఫైల్)

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన మహిళా రైతు బొబ్బిలి సువర్ణ(53) కర్నూలులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందింది. భర్త బొబ్బిలి సుంకన్న తెలిపిన మేరకు వివరాలు.. తమకున్న పొలంలో బొబ్బిలి సువర్ణ తన భర్తతో కలిసి పత్తి, ఆముదం, వేరుశనగ, మిరప తదితర పంటలను పండిస్తూ జీవనం సాగించేది. రెండు సంవత్సరాల నుంచి సరిగా పంటలు పండక రూ.8 లక్షలు అప్పులు మిగిలాయి. వీటిని ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై ఈనెల 11న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు అమీలియో ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి కోలుకోలేక మంగళవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గిరిధర్ తెలిపారు.